క్లుప్తంగా

రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

బత్తలపల్లి: మండల కేంద్రంలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి ఐదు రోజులు పాటు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక బత్తలపల్లి శాఖ ప్రతినిధులు గురువారం తెలిపారు. భక్తాదులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రేపు కోన కణ్వాశ్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన కోన కణ్వాశ్రమంలో ఈనెల 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కోన క్షేత్రంలో ఉన్న పాండురంగ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.

'వాల్మీకులను ఇంకెన్నాళ్లు మోసం చేస్తారు'


మాట్లాడుతున్న సాంబశివ

బత్తలపల్లి: వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తామని చెబుతూ ఇంకా ఎన్నేళ్లు ఇలా మోసం చేస్తారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాయలసీమ ఇన్‌చార్జ్ బోయ సాంబశివ ప్రశ్నించారు. గురువారం ఈదుల ముష్టూరు గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వాల్మీకులు ఎస్టీ పునరుద్ధరణ అంశంపైన ఎన్నో ఉద్యమాలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో వాల్మీకులకు ఎస్టీ పునరుద్ధరణపై హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఐటీ శాఖామంత్రి లోకేష్ గానీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఒక్కమాట మాట్లాడకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని లేనిపక్షంలో పాలకులకు ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు.

చేనేత మగ్గాల పరిశీలన


చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేనేత మగ్గాల్లో వర్షపునీరు నిలిచి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో గురువారం ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేష్‌బాబు తదితరులు ఇందిరమ్మకాలనీ, ఎల్–3 కాలనీ, దుర్గానగర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా మగ్గం గుంతల్లో చేరిన వర్షపు నీటిని పరిశీలించి చేనేత కార్మికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన చేనేత కార్మికులకు ఆర్థికసాయం, సబ్సిడీల రూపంలో తక్షణ సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

కరపత్రాల విడుదల

నల్లచెరువు: స్థానిక గీతామందిరంలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల కరపత్రాలను ఆలయ కమిటీ చైర్మన్ దాదెం శివారెడ్డి గురువారం కమిటీ సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి సందర్భంగా గీతామందిరంలోని శనివారం వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆలయ ప్రాంగణంలో పాలపాటి దిన్నె ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దేవరింటి భాస్కర్ రెడ్డితో భగవద్గీత ఉపన్యాసం ఉంటుందన్నారు. భజన సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, కొండప్ప, వెంకటరమణ పాల్గొన్నారు.

మూగజీవాలకు సీజనల్ ముప్పు

- నీలినాలుక, థైలేరియాసిస్, గాలికుంటు వ్యాధులపై అప్రమత్తత అవసరం
- సకాలంలో గుర్తించి టీకాలు వేయించకుంటే తీవ్ర నష్టం
- సూచనలు, సలహాలు పాటించాలంటున్న పశువైద్యాధికారులు



గొర్రెలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

ఎన్పీకుంట: రుతుపవనాల ఆగమనంతో పాటు ఉపరితల ఆవర్తనంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని వర్షాలు విరివిగా కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో మూగజీవాలకు సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే పెంపకందారులు నష్టపోవాల్సి వస్తుందని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. మండలంలోని పశువైద్యశాల పరిధిలో 1,42,066 గొర్రెలు, 23,555 మేకలు, 7714 ఆవులు, 1401 గేదెలు ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాల కారణంగా మూగజీవాలలో ముఖ్యంగా నీలినాలుక, థైలేరియాసిస్, గాలికుంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. సకాలంలో వ్యాధులను గుర్తించకపోతే పెంపకందార్లు తీవ్రంగా నష్టపోవాల్సిందే. కాబట్టి పెంపకందారులు పశువైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే జీవాలను వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు.

నీలినాలుక వ్యాధి లక్షణాలు, నివారణ..

గొర్రెలలో నీలినాలుక వ్యాధి చాలా ప్రమాదకరమైనది. ఇది వైరస్ వ్యాధి. క్యూలికాయిడ్స్ అనే దోమ జాతికి చెందిన కీటకాల ద్వారా ఒక గొర్రె నుంచి మరో గొర్రెకు వ్యాపిస్తుంది. వర్షాకాలంలో దోమల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వ్యాధి తీవ్రత కూడా ఎక్కువగా ఉండి గొర్రెలు చనిపోయే ప్రమాదం ఉంది. 105 నుంచి 106 డిగ్రీల జ్వరం ఉండి నోటిలో పుండ్లు ఏర్పడి చొంగ కారుతుంది. నోరు మొత్తం ఎర్రగా మారుతుంది. చొంగ నురగలా మారి పెదవులు, చిగుళ్లు, నాలుక వాచిపోతాయి. నాలుక చివరలో నీలిరంగు వస్తుంది. కాళ్ల గిట్టల చుట్టూ వాచి పుండ్లు ఏర్పడతాయి. ఆహారం తీసుకోక పోవడంతో ఆరోగ్యం క్షీణించి వారం రోజుల్లో మృత్యువాత పడతాయి.

నివారణ..

వ్యాధి సోకిన గొర్రెలను సకాలంలో గుర్తించి పశువైద్యులతో చికిత్స చేయించాలి. నోటిపుండ్లను ఒక శాతం బోరిక్‌యాసిడ్ లోషన్‌తో శుభ్రం చేయాలి. గొర్రెలు ఆకలితో చనిపోకుండా ఉండేందుకు జావ లాంటివి తాపించాలి. గిట్టల చుట్టూ ఉన్న పుండ్లను కడిగి హిమాక్స్, నీమ్‌వెంట్ వంటి ఆయింట్‌మెంట్లు పూయాలి. యాంటిబయాటిక్ ఇంజెక్షన్లు ఇప్పించాలి. దోమల నివారణకు పరిసరాలను శుభ్రంగా ఉంచి వేపాకు పొగ పెట్టాలి. వ్యాధినిరోధక శక్తి పెరిగేందుకు విటమిన్–సి ఇంజెక్షన్, పాడులను వాడాలి.

థైలేరియాసిస్..

ఈ వ్యాధి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి పశువులకు వస్తుంది. పరాన్నజీవికి చెందిన గోమార్లు, పిడుదుల వలన ఈ వ్యాధి సోకుతుంది. 6 నుండి 12 నెలల వయసు ఉన్న పశువులు ఈ వ్యాధిబారిన పడతాయి. పరాన్నజీవులు మూగజీవాల రక్తకణాల్లో ఆవాసం ఏర్పరుచుకోవడంతో రక్తకణాలు పగిలి మృత్యువాత పడతాయి. ఈ వ్యాధి సోకిన పశువులెళ్ల మాత్రం కాఫీ, ఎరుపు రంగులో ఉంటుంది. తీవ్ర జ్వరం, ముక్కు నుంచి నురగ కారడం, శ్వాస తీసుకోవడం కష్టం అవుతుంది. తరచుగా దగ్గడంతో పాటు కళ్లు ఎర్రగా మారుతాయి. మేత తినవు, నెమరు వేయవు. రక్తం, బంక విరేచనాలు అవుతాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది.

నివారణ..

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల కొట్టంలో పురుగుమందులు కొట్టాలి. పశువుల పాకలో మురుగు, తేమ లేకుండా చూసుకోవాలి. టెట్రాసైక్లిన్, ప్రోటోమిన్ మందులతో పాటు ఐరన్ ఇంజెక్షన్లు వాడాలి.

గాలికుంటు వ్యాధి..

గాలికుంటు వ్యాధి ఆప్తోవైరస్ పికోర్న జాతికి చెందిన వైరస్ వలన వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి సగానికి తగ్గిపోతుంది. నోరు, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి పశువులు కుంటుతూ మేత మేయవు నెమరు వేయవు. 104 నుండి 106 డిగ్రీల జ్వరం వస్తుంది. నోటి నుండి చొంగ కారుతుంది. ఆడ పశువుల్లో వంధ్యత్వం ఏర్పడుతుంది. ఎద్దుల్లో పనిసామర్థ్యం తగ్గుతుంది. ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. వ్యాధి సోకకుండా గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



మూగజీవాల పెంపకందారులు సకాలంలో టీకాలు వేయించడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవచ్చు. వర్షాకాలంలో అధికంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జీవాలను గమనిస్తూ ఏదైనా సమస్య ఉంటే పశువైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ నారాయణస్వామినాయక్, ఇన్‌చార్జ్ పశువైద్యాధికారి, ఎస్.పీ.కుంట

గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఎన్పీకుంట: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌వర్ధన్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వెలిచలమల, టీఎన్‌పల్లి గ్రామాలకు చెందిన 25 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. వీరిలో నాలుగు హైరిస్క్ కేసులను గుర్తించినట్లు సీహెచ్ఓ నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఆయా ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

చెన్నేకొత్తపల్లి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత వైద్యులకు సూచించారు. రామగిరిలోని పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌లో గురువారం ఎమ్మెల్యేను కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

వడ్డీ వ్యాపారులు బెదిరిస్తున్నారని చేనేత కార్మికుడి ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: అప్పుగా తీసుకున్న డబ్బు చెల్లించాలని వడ్డీ వ్యాపారులు బెదిరిస్తున్నారని చేనేత కార్మికుడు మల్లె రమేష్ గురువారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన మల్లె రమేష్ పవర్‌లూమ్ మగ్గం నేస్తూ జీవిస్తున్నాడు. రమేష్ గతేడాది డిసెంబర్‌లో అవసరం కోసం ఎర్రగుంట రాజాతో రూ.1.20 లక్షలు రూ.10 వడ్డీకి అప్పుగా తీసుకున్నాడు. అప్పటి నుంచి రూ.10 వడ్డీ ప్రకారం రూ.1.60 లక్షలు చెల్లించాడు. ఆర్థిక ఇబ్బందులతో మూడు నెలలుగా వడ్డీ కట్టలేకపోయాడు. రాజా డబ్బు కోసం ఒత్తిడి చేశాడు. దీంతో ఈ ఏడాది మే నెలలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ చేసి అసలు డబ్బు రూ.1.20 లక్షలు రాజాకు చెల్లించారు. అసలుపై అదనంగా రూ.50 వేలు ఇవ్వాలని పంచాయతీలో రాజా చెప్పి వెళ్లాడు. రమేష్ ఆర్థిక ఇబ్బందులతో డబ్బు కట్టకపోవడంతో జూలై 20న రమేష్, అతని భార్య రుక్మిణి ఇంటిలో ఉండగా రాజా, అతని అనుచరుడు మల్లికి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారు. వారికి భయపడి రమేష్ దంపతులు ఎవరికీ చెప్పలేదు. ప్రస్తుతం రాజా అనుచరుడు మల్లి రమేష్ ఇంటికి వెళ్లి డబ్బు కట్టాలని బెదిరించాడు. దీంతో రమేష్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

కదిరి అర్బన్: గంగన్నగారిపల్లి వద్దనున్న జగనన్న కాలనీలో గురువారం విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఆటోడ్రైవర్‌గా పని చేసే గంగరాజు ఆటో సామాన్లు మిద్దెమీద ఉండడంతో తీసుకొచ్చేందుకు పైకి వెళ్లాడు. ఇళ్లపైన 11 కేవీ విద్యుత్ తీగలు తాకడంతో విద్యుదాఘాతనికి గురయ్యారు. వెంటనే స్థానికులు అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పనిచేద్దాం


మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

తనకల్లు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ నాయకులకు సూచించారు. కొక్కంటి గ్రామంలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసులునాయుడు స్వగృహంలో గురువారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదికి దాటినా ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలను గుర్తు పెట్టుకుని అధికారంలోకి రాగానే వారికి పెద్దపీట వేస్తామన్నారు. బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, సర్పంచులు కృష్ణారెడ్డి, నాగరాజు, ఎంపీటీసీలు శ్రీనివాసులు, చలపతి, గోపాల్‌నాయక్, నాయకులు శ్రీకంతారెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దొరస్వామి, శివశంకర్, రామకృష్ణ, సూరి, హరికృష్ణారెడ్డి, బీరప్ప, ఆదినారాయణ, జేసీబీ అలి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి


మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి టౌన్: ఈనెల 20 నుంచి 25 వరకూ ఒంగోలులో జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సాయి ఆరామంలో రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను నాయకులతో కలసి విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చినా నరేంద్రమోదీ నల్లధనం వెనక్కి తీస్తానన్న హామీ నెరవేర్చలేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నిరుద్యోగులకు ఆశ చూపి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పట్టణంలో రెండుసెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా సెంటు భూమి కూడా ఇవ్వలేదన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జయలక్ష్మి రైతు సంఘం నాయకులు పూల శ్రీనివాసులు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి గుండెపోటుతో రైతు మృతి


వీరారెడ్డి(ఫైల్)

ధర్మవరం అర్బన్: శుభకార్యానికి వెళ్లి గుండెపోటుతో రైతు మృతి చెందిన ఘటన ధర్మవరంలో గురువారం జరిగింది. బంధువులు, వార్డు ప్రజలు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపల్ పరిధిలోని 9వవార్డు చిన్నూరుకు చెందిన వీరారెడ్డి(38) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వ్యవసాయం సరిగ్గా సాగకపోవడంతో కుటుంబ పోషణ కోసం దాదాపు రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. ప్రస్తుతం ఎద్దులబండి పెట్టుకుని బాడుగకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ధర్మవరంలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లిన వీరారెడ్డి గుండెపోటు రావడంతో కుప్పకూలి పడిపోయాడు. వెంటనే బంధువులు, కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రైతు మృతితో చిన్నూరు వార్డులోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మృతునికి భార్య శాంతి, కుమారుడు పవన్‌కుమార్ రెడ్డి, కుమార్తె స్నేహలత ఉన్నారు. కుమారుడు తిరుపతిలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా కుమార్తె ధర్మవరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

మహనీయుల త్యాగఫలమే స్వేచ్ఛా జీవనం


తాడిమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


రైల్వేస్టేషన్‌లో ర్యాలీలో పాల్గొన్న స్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు, రైల్వే పోలీసులు, సిబ్బంది


కనగానపల్లిలో జాతీయ జెండాలతో ర్యాలీ

తాడిమర్రి: స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలితంగానే దేశ ప్రజలు స్వేచ్ఛా జీవనం గడుపుతున్నారని ఎంపీడీఓ వెంకటరంగారావు, తహసీల్దార్ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలసి వారు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత 79వ స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని స్వాంతంత్య్ర పోరాటంలో భాగస్వాములైన వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమోహన్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేంద్రబాబు, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జీఆర్‌పీఎస్, రైల్వే సిబ్బంది జాతీయ పతాకాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ప్రగతి పథంలో ముందడుగు వేయాలన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిపిన ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత త్రివిధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ప్రతిదాడులు చేసి విజయం సాధించాయన్నారు.

కనగానపల్లి: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఓ పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. జెండాలు చేతపట్టుకుని ప్రధాన వీధుల్లో నినాదాలు చేస్తూ ముందుకెళ్లారు. భారత్ మాతాకు జై, జై జవాన్, జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు.

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవి కుమార్, శ్రీనివాసులు, ఓబిలేసు, రాజ్ మహమ్మద్, గంగరాజు, నాగేంద్ర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కీచక ఎస్‌ఐను అరెస్ట్ చేయాలి

పుట్టపర్తి టౌన్: గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పట్నం పూర్వ ఎస్ఐ రాజశేఖర్‌ను తక్షణమే అరెస్ట్ చేసి క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్‌ని కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఎస్ఐ రాజశేఖర్ తన పోలీస్ తెలివి తేటలతో గిరిజన మహిళలను ఒత్తిడి చేసి వారితోనే పదేపదే వీడియో కాల్ చేయించుకుని గంటల తరబడి మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పని నిమిత్తం అనంతపురం వెళ్లిన గిరిజన మహిళను ఆమె బంధువులు వెంట ఉన్నారని కూడా చూడకుండా ఓ రౌడీలా బలవంతంగా తన కారులోకి లాగడం దుర్మార్గమన్నారు. భవిష్యత్తులో గిరిజన మహిళల పట్ల ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు ఎస్ఐ రాజశేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే గిరిజనులను ఏకం చేసి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

క్షయపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్

పుట్టపర్తి: క్షయపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ సూచించారు. గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా క్షయ నివారణ అధికారి అబీబ్ బాషా, వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. వ్యాధి లక్షణాలను జిల్లా క్షయ నివారణ అధికారి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వెలుగులు


విద్యుద్దీపాలంకరణలో పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం


శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలో యశోద పాఠశాల విద్యార్థులు



పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు


కృష్ణుడు, గోపికల వేషధారణలో సరస్వతీ విద్యామందిరం చిన్నారులు


కాకతీయ విద్యానికేతన్‌లో ఉట్టి కొడుతున్న దృశ్యం

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషాధరణలో అలరించారు. ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, భక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.